క్లుప్తంగా

నేటి నుంచి పైడితల్లి జాతర



పైడితల్లి

దెంకాడ: కోర్కెలు తీర్చే కల్పవల్లి, డెంకాడ ప్రాంత ఇలవేల్పు జొన్నాడ పైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవం సోమవారం నుంచి ప్రారంభమవుతుందని ఆలయ ఏక సభ్య ధర్మకర్త జి.శ్రీనివాస్, గ్రామపెద్దలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 19వ తేదీ నుంచి 21 వరకు జరగనున్న జాతరలో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. మంగళవారం ప్రధాన జాతర ఉంటుందని, ఆ రోజు అమ్మవారిని దర్శించుకునే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పోటీ పరీక్షలో తేజశ్విని ప్రతిభ



నగదు బహుమతితో పాటు ప్రశంసాపత్రం అందుకుంటున్న తేజశ్విని

డెంకాడ: రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7, 10వ తరగతి విద్యార్థులకు ఇటీవల ఈఈఎంటీ అనే సంస్థ నిర్వహించిన పరీక్షలో గొడిపాలెం ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన పతివాడ తేజశ్విని జిల్లాలో మొదటి స్థానంలో నిలిచింది. ఏడో తరగతి చదువుతున్న తేజశ్విని జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలవడంతో విజయవాడలో రూ. 5వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేశారు. దీంతో విద్యార్థినిని ఎంఈఓ, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆర్‌ఎస్ జాన్‌కు సత్కారం



ఆర్‌ఎస్.జాన్‌ను సత్కరిస్తున్న చర్చి సంఘ ప్రతినిధులు

విజయనగరం టౌన్: పట్టణంలోని సిమ్స్ బాప్టిస్ట్ చర్చి ఆవరణలో జిల్లా మైనారిటీ సంఘ అధికారి ఆర్‌ఎస్.జాన్‌ను చర్చి ప్రతినిధులు ఆదివారం ఘనంగా సత్కరించారు. సంఘ కార్యవర్గ అధ్యక్షుడు తాలాడ ఆనందరావు, ఉపాధ్యక్షుడు వరప్రసాద్, కోశాధికారి ఏకే కుమార్, ఆర్. ఝాన్సీరాణి, రాజ్‌కుమార్, సుగుణారావు, తదితరులు దుశ్శాలువ , పూలబొకేలతో సన్మానించారు. కార్యక్రమంలో ఆశాజాన్, ప్రభాకర్, జీవన్, తదితరులు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి




కరపత్ర ప్రచారంలో పాల్గొన్న యూనియన్ నాయకులు

విజయనగరం ఫూల్‌బాగ్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 20న స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని కార్మిక యూనియన్ రాష్ట్ర కమిటీ సభ్యుడు ఎ. జగన్ మోహన్‌రావు పిలుపునిచ్చారు. ఈ మేరకు పట్టణంలోని గాజులరేగ, హుకుంపేట, కొత్తపేట, ఫూల్‌బాగ్, జొన్నగుడ్డి ప్రాంతాల్లో ఆదివారం ప్రచారం నిర్వహించి, కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రామారావు, ఆదినారాయణ, రమణ, కృష్ణ, బాబూరావు, శివ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలం ఆక్రమణకు యత్నం

- జేసీబీతో చదును చేసిన వైనం



జేసీబీతో చదును చేసిన స్థలం

నెల్లిమర్ల: నగర పంచాయతీ పరిధిలోని విజయనగరం – పాలకొండ ప్రధాన రహదారిలో మొయిద జంక్షన్ సమీపంలో (సర్వే నంబర్ 28) రూ.50 లక్షల విలువైన ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించుకోవడానికి కొందరు వ్యక్తులు సన్నాహాలు చేస్తున్నారు. తాజాగా మూడు రోజుల కిందట సుమారు ఐదు సెంట్ల స్థలాన్ని జేసీబీతో చదును చేయించారు. ఈ స్థలాన్ని చేజిక్కించుకునేందుకు అక్రమార్కులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రోడ్ల విస్తరణ పనులు వేగవంతం



80 అడుగులతో విశాలంగా రూపుదిద్దుకుంటున్న ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి అయ్యన్నపేటకు వెళ్లే రోడ్డు

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చొరవతో ఆర్‌అండ్ బి – అయ్యన్నపేట రోడ్డు విస్తరణ
- రూ.2.40 కోట్ల వీఎంఆర్‌డీఏ నిధులతో 1.3 కిలోమీటర్ల మేర రోడ్డు అభివృద్ధి
- కార్పొరేషన్ నిధులతో 36 విద్యుత్ దీపాల ఏర్పాటు



విస్తరణ పనుల్లో భాగంగా వేస్తున్న బీటీ రోడ్డు

విజయనగరం: గత ప్రభుత్వ హయాంలో ప్రారంభించి చేయలేక చేతులెత్తేసిన అభివృద్ధి పనులు పూర్తి చేసే దిశగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు నగర అభివృద్ధే ధ్యేయంగా విజయనగరం కార్పొరేషన్ పరిధిలోని ప్రధాన రోడ్ల విస్తరణపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే నగరంలోని వివిధ మార్గాల్లో రోడ్ల విస్తరణ పనులు పూర్తి చేసి ప్రగతి బాటలు వేసింది. నగరంలో నిత్యం ప్రయాణికులతో రద్దీగా ఉండే 1.2 కిలోమీటర్ల పొడవు గల బాలాజీ జంక్షన్ నుంచి మయూరి జంక్షన్‌కు వెళ్లే ట్యాంక్‌బండ్ రోడ్‌ను 100 నుంచి 120 అడుగుల వెడల్పుతో 6 లేన్లుగా విస్తరించి వినియోగంలోకి తీసుకువచ్చిన విషయం విదితమే. తాజాగా వీఎంఆర్‌డీఏ పరిధిలో గల నగరంలోని ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి అయ్యన్నపేటకు వెళ్లే 1.3 కిలోమీటర్ల పొడవు గల రోడ్డులో రూ.2.40 కోట్ల వ్యయంతో విస్తరణ పనులు చేపట్టగా.. 60 అడుగుల నుంచి 80 అడుగులు మేర విస్తరించారు. విస్తరణలో భాగంగా సెంట్రల్ డివైడర్ ఏర్పాటు చేయగా.. విజయనగరం కార్పొరేషన్ ఆధ్వర్యంలో రూ.39 లక్షలతో 36 విద్యుత్ స్తంభాలు వేసి వీధి దీపాలు ఏర్పాటు చేశారు. ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తి కావడంతో నగరం నుంచి రాకపోకలు సాగించే 10 గ్రామాల ప్రజలకు ఉపయుక్తంగా మారింది.

డిప్యూటీ స్పీకర్ కోలగట్ల చొరవతో...

కార్పొరేషన్ హోదా దక్కించుకున్న విజయనగరంలో గతంలో ఎన్నడూ చూడని విధంగా గడిచిన నాలుగున్నరేళ్లలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. స్థానిక ఎమ్మెల్యే, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి చొరవతో నగర సుందరీకరణ, రోడ్ల విస్తరణతో పాటు క్షేత్ర స్థాయి పర్యటనల్లో గుర్తించిన ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్నారు. అలాగే మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం హయాంలో ప్రారంభించి వదిలేసిన ఆర్‌అండ్‌బీ నుంచి అయ్యన్నపేటకు వెళ్లే రోడ్డు విస్తరణ పనులను సకాలంలో చేపట్టకపోవటంతో గతంలో వచ్చిన నిధులు వెనక్కి మళ్లిపోయాయి. దీంతో ఆ మార్గం గుండా రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రస్తుత ఎమ్మెల్యే కోలగట్ల ప్రభుత్వ పెద్దలకు సమస్యను వివరించి వెనక్కి మళ్లిన నిధులను మంజూరు చేయించారు. దీంతో వీఎంఆర్‌డీఏ అధికారులు పనులు ప్రారంభించారు. ఇప్పటికే సెంట్రల్ డివైడర్ పనులు పూర్తికాగా... 60 అడుగుల నుంచి 80 అడుగుల వెడల్పుతో బీటీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభించారు. మరోవైపు ఆర్‌అండ్‌బీ జంక్షన్ వద్ద.. రైతుబజార్ వద్ద మిగిలిపోయిన కాలువ నిర్మాణ పనులు చేపడుతున్నారు. దశాబ్దాలుగా కలగా మిగిలిపోయిన ఈ రోడ్డు విస్తరణ పనులు పూర్తయితే నగర ప్రజలతో పాటు విజయనగరం మండలంలోని 10 గ్రామాలకు చెందిన ప్రజలు రయ్ రయ్ మంటూ ప్రయాణం సాగించేందుకు అవకాశం ఉంటుంది.



రైతు బజార్ జంక్షన్ వద్ద కాలువ నిర్మాణం

పనులను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే కోలగట్ల

ప్రజలకు ఇచ్చిన హామీ నెరవేర్చడంలో భాగంగా ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి అయ్యన్నపేట జంక్షన్ రోడ్డు విస్తరణ పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి నిత్యం పర్యవేక్షిస్తున్నారు. రెండు రోజులకు ఒక మారు విస్తరణ పనులు పరిశీలించి వేగవంతం చేసేలా ఆదేశాలు జారీ చేస్తున్నారు.

నెలఖరులోగా పూర్తి..

ఆర్‌అండ్‌బీ జంక్షన్ నుంచి అయ్యన్నపేట రోడ్డు వరకు చేపడుతున్న విస్తరణ పనులు ఫిబ్రవరి నెలఖరులోగా పూర్తి చేస్తాం. రూ.2.40 కోట్ల వ్యయంతో 1.3 కిలోమీటర్ల మేర 60 అడుగుల నుంచి 80 అడుగుల మేర విస్తరణ పనులు చేపడుతున్నాం. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నాం. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పనులను నిత్యం పర్యవేక్షిస్తున్నారు.

– మురళీకృష్ణ, డీఈ, వీఎంఆర్‌డీఏ.

ప్రజా ప్రయోజన ఆలోచనలు అభినందనీయం



ఎన్ ఓవర్ వ్యూ ఆఫ్ ద యాస్పర్ రైటింగ్ పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కోలగట్ల వీరభద్రస్వామి

- డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

విజయనగరం: ప్రజలకు ఏదో ఒక రూపంలో ఉపకారం చేయాలని ఆలోచన చేయడం అభినందించాల్సిన విషయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న డాక్టర్ చెనుమల్లు విశ్వేశ్వరరావు విదేశాల్లో ఉంటూ పలు సమస్యలు ఎదుర్కొంటున్న తెలుగువారి కోసం రూపొందించిన ఎన్ ఓవర్ వ్యూ ఆఫ్ ద యాస్పర్ రైటింగ్ అనే పుస్తకాన్ని ఆదివారం డిప్యూటీ స్పీకర్ తన నివాసంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ.. తనకు తెలిసిన విషయాలను విదేశాల్లో ఉన్న భారతీయులకు ఉపయోగపడేలా పుస్తకాన్ని రూపొందించిన విశ్వేశ్వరరావును ప్రతి ఒక్కరూ అభినందించాలని చెప్పారు. విదేశాల్లో ఉన్న భారతీయులకు ప్రభుత్వం, స్వచ్ఛంద సేవా సంస్థల పరంగా అక్కడ లభించే సహాయ సహకారాలు పూర్తిగా అర్థమయ్యేలా పుస్తకం రూపొందించడం సంతోషదాయకమన్నారు. పుస్తక రూపకర్త విశ్వేశ్వరరావు మాట్లాడుతూ, విదేశాల్లో ఉన్న భారతీయులు ఉద్యోగపరంగా.. జీవన విధానం పరంగా.. ఇతరత్రా అనేక సమస్యలు ఎదుర్కొంటూ అవస్థలు పడుతున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారానికి సూచనలు చేస్తూ ఈ పుస్తకం రూపొందించామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ విష్ణు వందనాదేవి, దీక్షితులు, రాజు, రమణ, టీవీ శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న పిరమిడ్ విన్యాసాలు



పిరమిడ్ ప్రదర్శనలో విద్యార్థులు

విజయనగరం అర్బన్: పట్టణంలోని ఫోర్ట్‌సిటీ స్కూల్‌లో ఆదివారం జరిగిన విద్యార్థుల మార్షల్ ఆర్ట్, పిరమిడ్ ప్రదర్శనలు పలువురిని ఆకట్టుకున్నాయి. రెండు రోజుల పాటు నిర్వహించే పాఠశాల వార్షికోత్సవాలు ఆదివారంతో ముగిసాయి. ఈ సందర్భంగా విద్యార్థులు మార్షల్ ఆర్ట్స్ విన్యాసాలు, పిరమిడ్ ప్రదర్శనలు, నాటికలు, యోగా, తైక్వాండో, కోలాటం ప్రదర్శనలు అలరించాయి. అనంతరం చదువులో రాణిస్తున్న వారికి, శతశాతం హాజరున్న విద్యార్థులకు పాఠశాల చైర్మన్ కేవీపీ రాజు (శివ) చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల వైస్ చైర్మన్ చంటి, ప్రిన్సిపాల్ డాక్టర్ రోయినాఖాన్, డైరెక్టర్లు మధు, అశోక్, నీలిమ, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నిరుపేదలను ఆదుకునేందుకు 'మేమున్నాం'



నిరుపేద మహిళలకు కుట్టుమిషన్‌లు అందజేస్తున్న సంస్థ ప్రతినిధులు

విజయనగరం టౌన్: నిరుపేదలకు మేమున్నాం స్వచ్ఛంద సంస్థ అండగా నిలుస్తుందని సంస్థ ప్రతినిధి కె. చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక ఎస్‌వీఎస్ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం నిర్వహించారు. అనంతరం మాతృభూమి సేవా సంఘం, ఎస్‌డీఏ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేదలకు కుట్టు మిషన్లు.. మేమున్నాం సంస్థ ఆధ్వర్యంలో నిరుపేద విద్యార్థినికి ఆర్థికసాయం చేశారు. ఈ సందర్భంగా ప్రముఖ సంఘ సేవకుడు చంద్రశేఖర్ మాట్లాడుతూ.. ఆపదలో ఉన్నవాళ్లకు తామున్నామనే భరోసా కల్పించడం తమకెంతో ఆనందంగా ఉందన్నారు. సాధన యువజన సేవా సంఘం ప్రతినిధి దుర్గాప్రసాద్ 61వ సారి రక్తదానం చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కంది సత్యనారాయణమూర్తి, కోశాధికారి డోకి చంద్రశేఖర్, విజయ పాజిటివ్ నెట్‌వర్క్ అధ్యక్షురాలు పద్మ, తాడేపల్లి నాగేశ్వరరావు, మహేష్, మౌళి, యశ్వంత్, సింహాచలం, మోహన్, తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో భోగాపురం మేటి

- పంచాయతీలో రూ.7 కోట్లతో అభివృద్ధి పనులు
- సచివాలయాలు, విలేజ్ క్లినిక్‌ల ఏర్పాటు
- సీహెచ్‌సీ స్థాయిని 30 నుంచి 50 పడకలకు పెంపు
- దశాబ్దాల నాటి రోడ్ల సమస్యలకు పరిష్కారం



అభివృద్ధి చేసిన కమ్యూనిటీ హెల్త్ సెంటర్

భోగాపురం: వైఎస్సార్‌సీపీ పాలనలో పంచాయతీలు, గ్రామాలు అభివృద్ధి పథంలో దూసుకెళ్తున్నాయి. ఎన్నో ఏళ్లుగా అపరిష్కృతంగా ఉండిపోయిన సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపారు. ఇంతకుముందెన్నడూ చేయని విధంగా కోట్లాది రూపాయలతో పనులు చేపట్టారు. రూ.4 కోట్లతో భోగాపురం పంచాయతీ పరిధి సుందరపేటలో ఉన్న కమ్యూనిటీ హెల్త్ సెంటర్ స్థాయిని 30 నుంచి 50 పడకలకు పెంచుతూ నూతన భవనాన్ని నిర్మించారు. అలాగే మండల కేంద్రంలో రూ.1.03 కోట్లతో సచివాలయాలు, విలేజ్ క్లినిక్, తదితర కార్యాలయాలకు భవనాలను నిర్మించారు. ముఖ్యంగా మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిచ్చే పనులు చేశారు. మంచినీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకోవడంతో పాటు సీసీ, తారు రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారు. రెండు గ్రామ సచివాలయాలు ఏర్పాటు చేసి ప్రజల ఇంటి వద్దకే పాలన తీసుకువచ్చారు. అలాగే ఆర్‌బీకేలు ఏర్పాటు చేసి రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు గ్రామంలోనే అందజేయడంతో పాటు దిగుబడులను కూడా గ్రామంలోనే కొనుగోలు చేస్తున్నారు. పేదలకు ఉచితంగా వైద్యం, మందులు అందించేందుకు విలేజ్ క్లినిక్ ఏర్పాటైంది. భోగాపురం ఎస్సీ, బీసీ కాలనీ వాసులు దశాబ్దాలుగా తాగునీటికి ఇబ్బంది పడుతున్నారు. దీంతో దాదాపు రూ.30 లక్షలలో బోర్లు, పైపులైన్ పనులతో పాటు కాలనీలో నూతన మినీ ట్యాంక్ ఏర్పాటు చేస్తున్నారు. పనులు పూర్తయితే కాలనీ వాసుల తాగునీటి సమస్యకు చెక్ పడనుంది. అలాగే భోగాపురం పంచాయతీ మధుర గ్రామాలైన చెరువు కొమ్ము, కారిగొల్లపేట గ్రామాల్లో రహదారులు వేయడంతో గ్రామస్తుల దశాబ్దాల కల నెరవేరింది. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఆ రెండు గ్రామాలకు సరైన రోడ్డు సౌకర్యం లేక గ్రామస్తులు ఇబ్బందులు పడేవారు. దాదాపు రూ.1.60 కోట్లతో రెండు గ్రామాలకు బీటీ, సీసీ రోడ్లు నిర్మించారు. మొత్తానికి భోగాపురం పంచాయతీలో ఏడు కోట్ల రూపాయల విలువైన పనులు చేపట్టారు.



భోగాపురంలో నిర్మితమైన గ్రామ సచివాలయం-1



గ్రామ సచివాలయం-2



కారిగొల్లపేటకు నిర్మించిన సీసీ రోడ్డు



చెరువుకొమ్ము గొల్లపేటకు నిర్మించిన బీటీ రోడ్డు



ఆరోగ్య ఉపకేంద్రం భవనం



ఎస్సీ, బీసీ కాలనీలో తుది దశకు చేరుకున్న మినీ ట్యాంక్ నిర్మాణ పనులు

నేడు నమస్తే కార్యక్రమం..

విజయనగరం: స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఆదేశాల మేరకు విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో సోమవారం నమస్తే కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు కమిషనర్ ఎం.మల్లయ్యనాయుడు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మురుగు, సెప్టిక్ ట్యాంక్ కార్మికుల జీవన భద్రత, మెరుగైన ఉపాధి కల్పనే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు పేర్కొన్నారు. ఉదయం 11 గంటలకు కార్పొరేషన్ కార్యాలయంలో నిర్వహించే కార్యక్రమంలో మురుగు, సెప్టిక్ ట్యాంక్ శుభ్రపరిచే కార్మికులు, డ్రైవర్లు తమ పేర్లు, చేసే విధులను నమోదు చేయించుకోవాలని సూచించారు. ఈ అవకాశాన్ని సదరు కార్మికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆర్థిక సహాయం

మెరకముడిదాం: మండలంలోని పులిగుమ్మి గ్రామానికి చెందిన తలచుట్ల నారాయణరావు ఇటీవల మృతి చెందారు. ఇంటి పెద్ద దిక్కును కోల్పోయిన ఆ కుటుంబానికి గ్రామానికి చెందిన ఫ్రెండ్స్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు ఆదివారం రూ.51 వేల ఆర్థిక సహాయం అందజేశారు. స్థానిక సర్పంచ్ టి.ఈశ్వరరావు, పెద్దలు పాల్గొన్నారు.